క్లుప్తంగా

సబ్ స్టేషన్ మంజూరుకు ఉప ముఖ్యమంత్రికి వినతి



ఉపముఖ్యమంత్రిని కలిసిన ఆదిశ్రీనివాస్

మేడిపల్లి: భీమారం మండలం వెంకట్రావుపేటలో 33/11 కేవీ సబ్ స్టేషన్ ను 132/33 కేవీ సబ్ స్టేషన్ గా అప్ గ్రేడ్ చేయలని అలాగే భీమారంలో నూతనంగా 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను మంజూరు చేయలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ను ఆదివారం జ్యోతిరావు పూలే ప్రజా భవన్ లో ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ కలిసి విన్నవించారు. దీనికి డిప్యూటీ సీఎం సానుకూలంగా స్పందించారని త్వరలోనే మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.

అంత్యక్రియలకు ఎమ్మెల్యే సాయం



ఆర్థికసాయం అందిస్తున్న నాయకులు

కొండగట్టు: కొడిమ్యాల మండలం నమిలికొండ గ్రామానికి చెందిన సాత్రాజు సురేశ్ అనే పారిశుధ్య కార్మికుడు ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సురేశ్ దహన సంస్కారాలకు నిమిత్తం అయ్యే ఖర్చును పార్టీ కార్యకర్తలు నాయకుల ద్వారా వారి కుటుంబ సభ్యులకు ఆదివారం పంపించారు. బాధిత కుటుంబాన్ని అన్ని రకాలుగా ఆదుకుంటామని కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే ఫోన్లో మాట్లాడి హామీ ఇచ్చారు.

రాయికల్ అభివృద్ధిపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న కౌన్సిలర్లు

రాయికల్: రాయికల్ మున్సిపాలిటీ అభివృద్ధిపై ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ దృష్టి సాధించాలని కౌన్సిలర్లు తురగ శ్రీధర్‌రెడ్డి, మ్యాకల కాంతారావు, సాయికుమార్, మహేష్‌గౌడ్ కోరారు. ఆదివారం పట్టణంలో మాట్లాడారు. 2027లో జరిగే పునర్విభజనలో రాయికల్ మున్సిపాలిటీ జగిత్యాల నియోజకవర్గం నుంచి వెళ్తుందని ప్రచారంతో ఇద్దరు నాయకులు జగిత్యాల పట్టణాభివృద్ధిపైనే శ్రద్ధ చూపిస్తున్నారని, రాయికల్ మండలం, పట్టణంను పట్టించుకోవడం లేదన్నారు. పట్టణంలో కూడా డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిలిచిపోయాయని, వాటితోపాటు మరింత అభివృద్ధిపై దృష్టి సారించాలని కోరారు. సమవేశంలో నాయకులు ఎలిగేటి అనిల్, శ్రీరాముల సత్యనారాయణ, పెండల గణేశ్ పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు అండగా ఉంటాం



విద్యార్థులకు బుక్స్ అందిస్తున్న గంగాధర్

ధర్మపురి: పేదరికంతో బాధపడుతూ ఉన్నత చదువులు చదువలేని విద్యార్థులకు జిల్లా మహేంద్ర సంఘం అండగా ఉంటుందని మహేంద్ర సంఘం జిల్లా అధ్యక్షుడు ఇందూరి గంగాధర్ అన్నారు. విద్యార్థులను చదువుల్లో ప్రోత్సహించడానికి ధర్మపురి మండలంలోని నేరెళ్ల, జైనా, చిన్నాపూర్ గ్రామాల్లో విద్యార్థులకు పిల్లి కిషన్ ఆధ్వర్యంలో నోటుబుక్స్, మహేంద్ర సంఘం ఆధ్వర్యంలో విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు గైని లచ్చన్న, ప్రధాన కార్యదర్శి శేర్ల రాజేశం, రాష్ట్ర సభ్యుడు పిల్లి శ్రీనివాస్, మండల నాయకులు పాల్గొన్నారు.

రేచపల్లిలో ఉచిత వైద్య శిబిరం

సారంగాపూర్: మండలంలోని రేచపల్లిలో ఆదివారం జగిత్యాలకు చెందిన సాయి స్వాస్థ్య వెల్‌నెస్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. దాదాపు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు జయపాల్‌రెడ్డి, వేణు, సంతోష్, మానస, కేశవ్, జ్యోతి, నాయకులు పాల్గొన్నారు.

మొండి బకాయిదారులపై నజర్

- భారీగా పేరుకుపోయిన బకాయిలు
- రుణాల చెల్లింపుపై నిర్లక్ష్యం
- వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించిన మెట్‌పల్లి 'సహకార' పాలకవర్గం



సహకార సంఘ కార్యాలయం

మెట్‌పల్లి: పట్టణంలోని విశాల సహకార పరపతి సంఘంలో తీసుకున్న రుణాల చెల్లింపు విషయంలో పలువురు నిర్లక్ష్యం చూపుతున్నారు. దీంతో బకాయిలు భారీగా పేరుకపోవడంతో వాటి వసూళ్లపై పాలకవర్గ సభ్యులు ప్రత్యేకదృష్టి సారించారు. ఈ మేరకు రుణాలను వెంటనే చెల్లించాలని, లేని పక్షంలో నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొంటూ బకాయిదారులకు నోటీసులు జారీ చేస్తున్నారు.

మొత్తం రూ.12 కోట్ల రుణాలు

- సంఘం పరిధిలో మొత్తం 10 గ్రామాలుండగా, వీటి నుంచి 1756 మంది రైతులు సభ్యులుగా ఉన్నారు.
- అయితే స్వల్పకాలిక రుణాల కింద రూ.7.50 కోట్లు, దీర్ఘకాలిక రుణాల కింద రూ.4.35కోట్లు అందజేశారు.
- వీటిలో దీర్ఘకాలిక రుణాలు చెల్లించే విషయంలో పలువురు మొండికేస్తున్నారు. ఏళ్ల తరబడి చెల్లించకపోవడంతో బకాయిలు పేరుకపోతున్నాయి.
- దీంతో సంఘానికి ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

వసూళ్లపై అలసత్వం

- తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించేలా సంఘ సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి
- కానీ ఈ విషయంలో సిబ్బంది అలసత్వం చూపుతుండడంతో చాలా మంది ఏళ్లుగా చెల్లించడం లేదనే విమర్శలు ఉన్నాయి.
- దీనివల్ల బకాయిలు ఏటా పెరిగిపోతూ ఉండడంతో సంఘ కార్యకలాపాలకు ఇబ్బందిగా మారింది.

కఠినంగా వ్యవహరించాలని నిర్ణయం

- ఇటీవల నూతన చైర్మన్‌గా నియమితులైన కొమిరెడ్డి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో పాలకవర్గ సభ్యులు బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించారు. మొండి బకాయిదారులను గుర్తించి వారికి నోటీసులు ఇవ్వాలని నిర్ణయించారు. ఇందులో ఇప్పటికే కొందరికి నోటీసులు పంపించారు. అయినా బకాయిలు చెల్లించకుంటే ఆ తదుపరి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునేలా కార్యాచరణ రూపొందించారు.

సంఘ అభివృద్ధికి సహకరించాలి



సంఘం నుంచి స్వల్ప, దీర్ఘకాలిక రుణాలు తీసుకుని చాలా కాలంగా చెల్లించని వారికి నోటీసులు ఇస్తున్నాం. అలాంటి వారు వెంటనే తమ బకాయిలు చెల్లించాలి. లేకుంటే కఠినచర్యలు తీసుకుంటాం. బకాయిలు చెల్లించి సంఘం బలోపేతానికి సహకరించాలి.

– కొమిరెడ్డి తిరుపతిరెడ్డి, చైర్మన్



భూషణ్‌రావుపేటలో పోచమ్మ బోనాలతో భక్తుల ఊరేగింపు

ఘనంగా పోచమ్మ బోనాలు

కథలాపూర్/ఇబ్రహీంపట్నం: కథలాపూర్ మండలం భూషణరావుపేటలో, ఇబ్రహీంపట్నం మండలం వేములకుర్తిలో వీడీసీ సభ్యులు, కుల సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మతల్లికి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా డప్పు చప్పుళ్లు, పోతరాజుల విన్యాసాలతో మహిళలు బోనాలు నెత్తిన పెట్టుకుని ఆలయానికి వెళ్లి అమ్మవారికి బోనాలు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమాల్లో కౌన్సిలర్లు, వీడీసీ సభ్యులు, కులసంఘాల ప్రతినిధులు, నాయకులు, మహిళలు, యువకులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

దుర్గమాతకు బోనాలు

మల్లాపూర్: మల్లాపూర్ మండల కేంద్రంలో ఆదివారం శ్రీ కనక దుర్గ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆషాడ బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో తరలివచ్చి దుర్గాదేవి అమ్మవారికి సమర్పించారు. వేడుకల్లో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సంగ గంగరాజం, ఆలయ కమిటీ అధ్యక్షుడు క్యాతం లక్ష్మారెడ్డి, వీడీసీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.



మల్లాపూర్‌లో దుర్గామాత బోనాలు

నిరుపేదల పాలిట వరం సీఎంఆర్ఎఫ్



సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులతో ఎమ్మెల్యే

- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్

జగిత్యాలటౌన్: సీఎం సహాయ నిధి నిరుపేదల పాలిట వరమని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని దేవిశ్రీగార్డెన్స్‌లో నియోజకవర్గానికి చెందిన 110 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎంతో కలిసి పనిచేసి జగిత్యాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర శస్త్ర చికిత్సలు

జగిత్యాల పావని కంటి ఆస్పత్రి, ఆపి రోటరీ క్లబ్ సంయుక్త భాగస్వామ్యంతో ఆదివారం జగిత్యాల, పరిసర ప్రాంతాలకు చెందిన 15మంది నిరుపేదలకు ఎమ్మెల్యే డా సంజయ్‌కుమార్ ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు చేసి మందులు, అద్దాలు అందజేశారు. కార్యక్రమంలో రోటరీ ఆపి క్లబ్ సభ్యులు మంచాల కృష్ణ, కొత్త ప్రతాప్, కాశీరావు, సాగర్ రావు, సాగర్ రావు, ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

అథ్లెట్‌కు సన్మానం

మల్లాపూర్: అండర్ –12 రన్నింగ్ పోటీల్లో పాల్గొన్న గణపతి హర్షవర్ధన్‌రాజ్ రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చి ప్రశంసా పత్రాన్ని సాధించడం అభినందనీయమని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు తోట రాజారాం అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో హర్షవర్ధన్‌రాజ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు మారుమూల గ్రామం చిట్టాపూర్ నుంచి రాష్ట్రస్థాయి క్రీడల్లో హర్షవర్ధన్ రాజ్ రాణించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ రిజియన్ కార్యదర్శి రుద్ర రాం ప్రసాద్, మాజీ అధ్యక్షుడు కనుక సంజీవ్, కార్యదర్శి సుతారి రాజేందర్, కోశాధికారి మార్గం రాజేశ్వర్, విష్ణువర్ధన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న ఎస్సై కిరణ్‌కుమార్

మల్లాపూర్: దేశంలో కొత్త క్రిమినల్ చట్టాలు, శిక్షలు అమల్లోకి వచ్చాయని, వాటిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్సై కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని హుస్సేన్‌నగర్‌లో ఆదివారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో కొత్తచట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కొత్త చట్టాలు పౌరులకు త్వరితగతిన చేరువకావడానికి, సులభతరమైన సేవలు కల్పించడానికే రూపుదిద్దుకున్నాయన్నారు.కార్యక్రమంలో గ్రామస్తులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'జువ్వాడి బ్రదర్స్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించం'

మల్లాపూర్: కాంగ్రెస్ నాయకులు జువ్వాడి నర్సింగరావు,కృష్ణారావులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పుంద్ర శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం మల్లాపూర్‌లో కాంగ్రెస్ నాయకులతో కలిసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గ వ్యాప్తంగా ఆలయాల అభివృద్ధికి టీటీడీ బోర్డు నిధులు మంజూరు చేసిందని, ఆ నిధుల ప్రొసీడింగ్ పత్రాలను జువ్వాడి బ్రదర్స్ ఆయా గ్రామాల నాయకులు అందజేస్తే స్థానిక ఎమ్మెల్యే ఓర్వలేకపోతున్నాడని దుయ్యబట్టారు. సమావేశంలో నారాయణరెడ్డి,ఎర్ర భూమయ్య, మండల అధ్యక్షుడు నర్సయ్య, నాయకులు పాల్గొన్నారు.

ఎన్‌సీఈఆర్‌టీ ఎంట్రెన్స్‌లో జగిత్యాల విద్యార్థికి ఫస్ట్ ర్యాంకు

జగిత్యాలటౌన్: నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రెనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ) వారు నిర్వహించే కామన్ ఎంట్రెన్స్ పరీక్షలో పట్టణంలోని శ్రీరాంనగర్‌కు చెందిన బడే మనోజ్‌కు ఓపెన్ కేటగిరీలో రాష్ట్ర సెకండ్ ర్యాంక్, ఓబీసీ విభాగంలో తెలంగాణలో ప్రథమ స్థానం సాధించాడు. జగిత్యాల జ్యోతి ఐఐటీలో హైస్కూల్ విద్య పూర్తి చేసిన మనోజ్, బాసర ట్రిపుల్ ఐటీలో చదివాడు.జాతీయ స్థాయిలో నిర్వహించే ఆర్ఐఈ(రీజనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్) నిర్వహించిన పరీక్షలో రాష్ట్రంలో 7సీట్లకు పోటీ పడి ఈ ఘనత సాధించాడు. మనోజ్ తండ్రి బడే అనిల్ యాదవ్ అటుకుల బట్టీలో పనిచేస్తుండగా తల్లి సత్య బీడీ కార్మికురాలు. మనోజ్‌ను స్థానికులు అభినందిస్తున్నారు.

ఎంబీబీఎస్ విద్యార్థిని చదువుకు చేయూత

మల్లాపూర్: ఎంబీబీఎస్ చదివేందుకు నిరుపేద విద్యార్థినికి బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బద్దం గంగాధర్‌రెడ్డి చేయూతనిస్తున్నారు. మండలంలోని చిట్టాపూర్‌కి చెందిన అప్ప రమేశ్ –లక్ష్మి దంపతుల పెద్దకుమార్తె ప్రనూషకు వైద్య విద్య కోసం రూ.30 వేలను బీజేపీ మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక బీజేపీ నాయకులతో కలిసి అందజేశారు. రమేశ్‌ది నిరుపేద కుటుంబం కావడంతో గంగాధర్‌రెడ్డి ప్రనూష ఎంబీబీఎస్ పూర్తి చేసేవరకు ప్రతీ ఏడాది రూ.30 వేల చొప్పున ఆర్థిక సాయం చేస్తానని హామీ ఇచ్చి రెండేళ్లు అందించారు. ఆదివారం రూ.30 వేలను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల ఉపాధ్యక్షుడు లవంగ శివకుమార్, అంజిరాజ్ దండుగుల, బూత్ అధ్యక్షుడు గజ్జెరి విజయ్‌కుమార్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

108 సిబ్బందికి ఇబ్బందులు

సారంగాపూర్: బీర్‌పూర్ మండల కేంద్రంలో అందుబాటులో ఉంచిన 108 వాహన సిబ్బంది సొంత భవనం లేక ఇబ్బంది పడుతున్నారు. బీర్‌పూర్‌లో ఏడాది క్రితం 108 వాహనం ప్రారంభించారు. అందులో పనిచేసే టెక్నీషియన్లు, డ్రైవర్లుకు తాత్కాలికంగా బీర్‌పూర్‌లోని మహిళా సంఘ భవనాన్ని కేటాయించారు. ప్రస్తుతం మహిళా సంఘ భవనంలో సెర్ప్ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణా కేంద్రం ఏర్పాటు చేస్తున్నారు. దీంతో అధికారులు 108 సిబ్బందిని భవనం ఖాళీ చేయాలని చెప్పడంతో తిరిగి వసతి దొరకడం ఇబ్బందికరంగా మారింది. దీనిపై ఎంపీడీవో లచ్చాలును వివరణ కోరగా 108 సిబ్బందికి, వాహనానికి వసతి కల్పిస్తామని పేర్కొన్నారు.

ఆగస్టు 30న రెడ్డి సంఘం ఎన్నికలు

జగిత్యాలజోన్: ఆగస్టు 30న జిల్లా రెడ్డి సంఘం ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా రెడ్డి సంఘం అధ్యక్షుడు డాక్టర్ శైలేందర్ రెడ్డి తెలిపారు. జిల్లా రెడ్డి సంఘం కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆగస్టు 30న ఎన్నికలు నిర్వహించాలని, సంఘంలో నూతన సభ్యత్వం ఇవ్వాలని నిర్ణయించారు. ఈ మేరకు ఎన్నికలకు సంబంధించిన విధి విధానాలతో పాటు సర్వసభ్య సమావేశాన్ని ఆగస్టు 4న నిర్వహించాలని తీర్మానించారు. సమావేశంలో సంఘ ప్రధాన కార్యదర్శి ముస్కు రాంగోపాల్ రెడ్డి, ఉపాధ్యక్షులు కాటిపెల్లి గంగారెడ్డి, కొప్పెర వెంకట్ రెడ్డి, కాలగిరి బాబు రెడ్డి, కొంగరి చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేకాట రాయళ్ల అరెస్టు

రాయికల్: మండలంలోని సింగరావుపేటలో పేకాట స్థావరంపై ఆదివారం ఎస్సై అశోక్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఏడుగురు పేకాట ఆడుతుండగా, ముగ్గురు వ్యక్తులు పరారీ అయ్యారని, వీరి నుంచి రూ.3,810 నగదును సీజ్ చేశారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

జగిత్యాలటౌన్: పట్టణంలోని వివేకానంద హైస్కూల్‌లో 1992–93 సంవత్సరం పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం జిల్లా కేంద్రంలోని వాసవి గార్డెన్స్‌లో అపూర్వ సమ్మేళనం నిర్వహించుకున్నారు. 31 ఏళ్ల తర్వాత మిత్రులందరూ ఒకే చోట చేరి పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. తమకు చదువు చెప్పిన గురువులను సత్కరించారు. కార్యక్రమంలో గుర్రం చంద్రశేఖర్, మానిక్యం గంగాధర్‌గౌడ్, ఆముద లింగారెడ్డి ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మల్యాల: మల్యాల సబ్‌స్టేషన్ పరిధిలోని ముత్యంపేట, రాజారం, నూకపల్లి గ్రామాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 01గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ సీహెచ్.బాలలింగం తెలిపారు. గ్రామాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నాలుగు గ్రామాలకు నిలిచిన విద్యుత్ సరఫరా



విద్యుత్ లైన్లపై పడిన చెట్లను తొలగిస్తున్న సిబ్బంది

సారంగాపూర్: కలప స్మగ్లర్ల నిర్వాకంతో నాలుగు గ్రామాల్లో శనివారం అర్ధరాత్రి నుండి ఆదివారం ఉదయం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సారంగాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని సారంగాపూర్, నాయికపుగూడెం, బట్టపల్లి, పోతారం గ్రామాల్లో శనివారం రాత్రి 11.30 గంటలకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఏడీఈ హరీశ్, ఏఈ సతీశ్ తమ సిబ్బందితో కలిసి అటవీప్రాంతంలో పరిశీలించారు. లక్ష్మీదేవిపల్లి అటవీప్రాంతంలో కలప స్మగ్లర్లు ఓ పెద్ద టేకు చెట్టును కొట్టి వేయడంతో 33 కేవీ విద్యుత్ లైన్‌పై చెట్టు పడి అంతరాయం ఏర్పడినట్లు గుర్తించారు. ఆ తరువాత సిబ్బంది నాలుగు గంటల పాటు శ్రమించి ఆదివారం ఉదయం 4.30 గంటల సమయంలో విద్యుత్తు సరఫరా పునరుద్ధరించారు. ఐదు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంపై ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. కలప స్మగ్లర్లు శని, ఆదివారం రాత్రిళ్లు ఇటువంటి సంఘటనలకు పాల్పడుతున్నారని, అటవీశాఖ అధికారులు నిఘా పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

సమాజంలో గురువులకు విశిష్ట స్థానం



మైతాపూర్ లో మాట్లాడుతున్న అశోక్‌రావు

రాయికల్: మన సంస్కృతిలో గురువుకు విశిష్టత ఉందని ఆర్ఎస్ఎస్ విభాగ్ సంపర్క్ ప్రముఖ్ ఎన్నమనేని అశోక్‌రావు అన్నారు. రాయికల్ మండలం మైతాపూర్‌లో ఆదివారం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన సంస్కృతిలో గురువుకు విశేష ప్రాధాన్యత ఉందని, గురువును భగవంతుడితో పోలుస్తారన్నారు. హిందూ ఆచార సాంప్రదాయాలను ప్రపంచంలోని దేశాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని, కొన్నివిశ్చిన్న శక్తులు విశ్చిన్నం చేసేందుకు కుట్రపన్నుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. హిందువులంతా ఐకమత్యంగా ఉంటూ ఆచార సాంప్రదాయాల కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఖండ కార్యవాహ వేల్పుల స్వామి,ఖండ భౌతిక ప్రముఖ్ జితేందర్‌రెడ్డి, స్వయంసేవకులు పాల్గొన్నారు.

రెడ్డి సంఘం అధ్యక్షుడిగా నర్సింహారెడ్డి



నూతన కార్యవర్గ సభ్యులు

పెగడపల్లి: పెగడపల్లి గ్రామ రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా కాటం నర్సింహరెడ్డి ఎన్నికయారు. స్థానిక రెడ్డి సంఘం భవనంలో ఆదివారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జాల శ్రీకాంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా చెర్లకోల వేణుగోపాల్‌రెడ్డి, ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా భూమాడి గంగారెడ్డి, తడుకమడ్ల శ్రీనివాస్‌రెడ్డి, మూల వెంకట్‌రెడ్డి, కాసం శ్రీనివాస్‌రెడ్డి, జాల అశోక్‌రెడ్డి, కోశాధికారిగా ఎస్‌రెడ్డి సత్యనారాయణరెడ్డి, ప్రచార కార్యదర్శిగా గంద్ర రమణారెడ్డి, ప్రధాన సలహాదారులుగా మూల గోపాల్‌రెడ్డి, పందిల్ల మల్లారెడ్డి, కాటం వెంకట్‌రెడ్డి, గంద్ర మహిపాల్‌రెడ్డి, గంద్ర మునీందర్ రెడ్డి ఎన్నికయ్యారు.

మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడిగా సత్యనారాయణ



సత్యనారాయణ



శంకర్

కోరుట్ల: మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడిగా కథలాపూర్ మండలం చింతకుంటకు చెందిన చెదలు సత్యనారాయణ ఎన్నికయ్యారు. ఆదివారం జగిత్యాలలోని బండారి గార్డెన్‌లో జరిగిన ఎన్నికల్లో అధ్యక్ష పదవికి ముగ్గురు పోటీ పడగా చెదలు సత్యనారాయణ 265 ఓట్లు సాధించి గెలుపొందారు. ఉపాధ్యక్షుడిగా కోరుట్లకు చెందిన బండారి శంకర్ ఎన్నికయ్యారు. తమ ఎన్నికకు సహకరించిన కులబాంధవులకు చెదలు సత్యనారాయణ, బండారి శంకర్ ధన్యవాదాలు తెలిపారు.

ఎస్సై కుటుంబానికి అండగా ఉంటాం

గొల్లపల్లి: ఇటీవల ఆత్మహత్య చేసుకున్న అశ్వరావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ కుటుంబానికి 2014 ఎస్సై,ఏపీ తెలంగాణ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శ్రీనివాస్ కుటుంబానికి రూ 25 లక్షల చెక్కుని అందజేశారు. నల్లబెల్లి మండలం నారక్కపేట గ్రామానికి వెళ్లి ఎస్సై చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఎస్సై శ్రీనివాస్ అదే బ్యాచ్‌కు చెందిన 746 మంది ఎస్సైలు డబ్బులు పోగుచేసి మృతుడి కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో గొల్లపల్లి ఎస్సై సతీశ్ తో పాటు 100 మంది ఎస్సైలు పాల్గొన్నారు.

అంధకారంలో ఆస్పత్రి



ఓపీ హాల్‌లో వెలగని బల్బులు

రాయికల్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో బల్బులు పనిచేయకపోవడంతో గత వారం రోజుల నుంచి అంధకారంలో ఉన్న పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఆస్పత్రి హాల్, ఓపీ హాల్, ల్యాబ్ రూం, బాత్రూంలో ఉన్న బల్బులన్నీ పనిచేయకపోవడంతో రాత్రి పూట ఆస్పత్రిలో పనిచేసే సిబ్బంది ,రోగులు ఇబ్బంది పడుతున్నారు. రాత్రి పూట భయాందోళన గురవుతున్నామని, పలుమార్లు ఈ విషయంపై ఆస్పత్రి సూపరింటెండెంట్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సూపరింటెండెంట్ స్పందించి ఆస్పత్రిలో విద్యుత్ బల్బులు వెలిగేలా చూడాలని రోగులు, వైద్య సిబ్బంది కోరుతున్నారు.

గోరింటాకు.. వనభోజన ఉత్సవం



రాయికల్: మండలంలోని కొత్తపేటలో ఆర్యవైశ్య పట్టణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వన భోజనం, గోరింటాకు ఉత్సవం ఘనంగా నిర్వహించారు. వాసవిమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మహిళలు గోరింటాకు వేడుకలు జరిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కూరగాయల రవి ,ప్రధాన కార్యదర్శి గరిపెల్లి శ్రీనివాస్,కోశాధికారి పల్లెర్ల పవన్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ధర్మపురి: ఆషాడమాసం సందర్భంగా మహిళలు గోరిటాకు వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ధనలక్ష్మి కిట్టిపార్టీ ఆధ్వర్యంలో మహిళలు ఈ వేడుకలను జరుపుకున్నారు.